
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
21-8-2026 (Friday)
MAIN EDITION

## భారత నావికులు ఉన్న షిప్ హైజాక్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత నావికులు ఉన్న ఓ షిప్‌ను సముద్ర దొంగలు హైజాక్ చేశారు. సోమాలియాలోని పుంట్‌లాండ్ తీరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సముద్రపు దొంగలు హైజాక్ చేసిన కామెరూన్ జెండా గల సరుకు రవాణా నౌకలోని 10 మంది సిబ్బందిలో కనీసం ఆరుగురు భారతీయులు ఉన్నారు. టర్కీ ఆయుధాలను తీసుకువెళ్తున్న ఆ నౌకను సముద్రపు దొంగలు ఆ ప్రాంతంలోని నుగాల్ తీరం వైపు తీసుకువెళ్లారని సోమాలియా అధికారులు తెలిపారు.

## శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద



**అక్షరటుడే, శ్రీశైలం :** శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. ఎగువన వర్షాలు పడుతుండడంతో ప్రాజెక్ట్‌లోకి మోస్తరు ఇన్‌ఫ్లో వస్తోంది. శ్రీశైలం జలాశయంలోకి ప్రస్తుతం 82,368 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కుడి గట్టు జల విద్యుత్ కేంద్రం ద్వారా ఉత్పత్తిని నిలిపివేశారు. ఎడమ గట్టు కేంద్రం ద్వారా మాత్రం ఉత్పత్తి కొనసాగుతోంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా దిగువకు 35,315 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 167 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

## ఉచిత కార్లు మాకొద్దు : డీఎంకే ఎమ్మెల్యేలు



**అక్షరటుడే, చెన్నై :** తమిళనాడులోని 234 మంది ఎమ్మెల్యేలకు ఉచితంగా కార్లు ఇస్తామని, వాటి నిర్వహణ కోసం ప్రతి నెలా రూ.75 వేలు అందిస్తామని సీఎం విజయ్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం అసెంబ్లీలో వాడీవేడిగా చర్చ జరిగింది. తమకు ఉచిత కార్లు వద్దని డీఎంకే ప్రకటించింది.

## ఎంపీ లింగమనేని కుమారుడి కేసులో విచారణ



**అక్షరటుడే, హైదరాబాద్ :** జనసేన ఎంపీ లింగమనేని రమేష్ కుమారుడు సంజాష్ కారుతో ఢీకొనడంతో ఓ యువతి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణ కొనసాగుతోంది. మాదాపూర్ ఇనార్బిట్ మాల్ దగ్గర ర్యాష్ డ్రైవింగ్ చేసి, కారుతో మహిళను లింగంనేని సంజాష్ ఢీకొట్టిన విషయం తెలిసిందే.

## ఎంపీ అవినాశ్ రెడ్డి ఇంట్లో ఈడీ దాడులు

**అక్షరటుడే, ఏపీ:** వైఎస్ వివేకా హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈడీ దాడులు చేసింది. ఎంపీ అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి ఆస్తులపై ఈడీ దృష్టి సారించింది. ఏకకాలంలో 10 చోట్ల సోదాలు చేపట్టింది. ఏపీలో నాలుగు, హైదరాబాద్‌లో ఆరుచోట్ల అధికారులు తనిఖీలు చేశారు.

# ‘కొండా’పై దండయాత్ర!

కాంగ్రెస్ పార్టీలో కొండా కుటుంబానికి వ్యతిరేకంగా పలువురు ఎమ్మెల్యేలు ఏకమయ్యారు. ఆమెను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆమె కూతురు కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలు.. సురేఖ పదవికి ఎసరు తెచ్చాయి. ఈ వ్యాఖ్యలపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ అధిష్ఠానం సీరియస్ అయినట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం సురేఖకు వ్యతిరేకంగా అధిష్ఠానానికి లేఖ రాశారు. తాజాగా సీఎల్పీ సమావేశంలో సైతం ఆమెను తొలగించాలని తీర్మానం చేయడం గమనార్హం.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- సుష్మిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యేలు
- సురేఖను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్
- సీఎల్పీ సమావేశంలో కీలక నిర్ణయం



సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుష్మిత వ్యాఖ్యల నేపథ్యంలో శుక్రవారం పలువురు ఎమ్మెల్యేలు సీఎల్పీ ఆఫీసులో సమావేశం అయ్యారు. ఇందులో కీలక నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. ఆమె తీరుతో పార్టీ నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు. ఒరిజినల్ కాంగ్రెస్ అని మాట్లాడుతున్న కొండా కుటుంబం ఎన్ని పార్టీలు తిరిగి వచ్చిందో అందరికీ తెలుసని విమర్శించారు. రాజగోపాల్‌రెడ్డి, చిన్నారెడ్డి వ్యవహారం సైతం సరికాదని ఎమ్మెల్యేలు అన్నారు.

**పదవులు అనుభవిస్తూ..**

ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ.. ఆది నుంచి కొండా సురేఖ తీరు పార్టీకి నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. కేటీఆర్, సమంత అంశంలో కొండా సురేఖ మాట్లాడింది తప్పన్నారు. సురేఖ భాష, తప్పుల వల్ల రేవంత్ రెడ్డి బద్నాం అవుతుంటే, ఆమె పదవులు ఎంజాయ్ చేస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి నిర్ణయాలను వ్యతిరేకిస్తున్న వాళ్లకి పార్టీలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు. సురేఖకు నోటీసులు ఇస్తే.. తన బిడ్డ మాటలకు సంబంధం లేదని చెబుతున్నారని, మరి ఆమె మాటలను ఎందుకు ఖండించలేదని ఆయన ప్రశ్నించారు.

**రాజీనామా చేయాలి**

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే బొడ్మ వెజ్జు మాట్లాడుతూ.. సురేఖ పార్టీకి రాజీనామా చేసి వెళ్లిపోవాలన్నారు. కూతురు మాటలపై ఆమె స్పందించాల్సిందేనన్నారు. వేలాది మంది కార్యకర్తలు కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చారని చెప్పారు. ‘సీఎం రేవంత్ రెడ్డిపై ప్రతిపక్ష నేతలు మాట్లాడితే అర్థం చేసుకోవచ్చు, కానీ సొంత పార్టీ నేతలే మాట్లాడడం సరికాదు.. ఏదైనా ఉంటే పీసీసీకి కానీ, సీఎంకి కానీ చెప్పుకోవాలని.. ఇలా మాట్లాడడం’ సరికాదన్నారు.

**పార్టీని ఖతం చేసేలా..**

కొండా కుటుంబం కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీని ఖతం చేసేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కులం అడ్డు పెట్టుకొని ఏం చేసినా నడుస్తుందనుకుంటే చెల్లదన్నారు. కొండా సురేఖ మంత్రిగా ఎన్ని రివ్యూ మీటింగులు పెట్టారని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రశ్నించారు. ఆమె అటవీ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కొండా సురేఖ భాష కాంగ్రెస్‌కి తలనొప్పిగా మారిందని, పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తోందన్నారు. ఆమె మీద కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## నా టార్గెట్ రేవంత్ రెడ్డి : కొండా సుష్మిత



**అక్షరటుడే, వరంగల్ :** మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుష్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. టికెట్ ప్రకటించడానికి రేవంత్‌రెడ్డికి ఏం అధికారం ఉందని ఆమె ప్రశ్నించారు. ఓ టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ.. సీఎంపై విమర్శలు చేశారు. తన టార్గెట్ రేవంత్‌రెడ్డి అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కాదన్నారు. తాను పార్టీని విమర్శించలేదని, రేవంత్ రెడ్డిని మాత్రమే విమర్శించానని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ అంటే తనకు గౌరవం ఉందని సుష్మిత తెలిపారు. కానీ ఇక్కడ రేవంత్ రెడ్డి, అతని సోదరులు విపరీతమైన అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందుకే ఆయనను టార్గెట్ చేశానని చెప్పారు.

## వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌పై బీజేపీ నిరసన




**అక్షరటుడే, బెంగళూరు:** మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కార్పొరేషన్ నిధుల దుర్వినియోగం కుంభకోణంలో కర్ణాటక మంత్రి నాగేంద్ర రాజీనామా చేయాలని బీజేపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బెంగళూరులోని వాల్మీకి విగ్రహం నుంచి విధాన సౌధ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రతిపక్ష నాయకుడు, బీజేపీ నేత అశోక్ మాట్లాడుతూ.. డీకే శివకుమార్, ఆయన సహచరుడు నాగేంద్ర కలిసి దళితులకు చెందిన రూ. 189 కోట్లను దోచుకున్నారని ఆరోపించారు. దళితుల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన డబ్బును దుర్వినియోగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అక్రమంగా డిఫెన్స్ మద్యం విక్రయం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** అక్రమంగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఆర్ నగర్ సమీపంలో రూ.1.5 లక్షల విలువైన 55 సీసాల కర్ణాటక ప్రీమియం, డిఫెన్స్ లిక్కర్‌ను అమీర్‌పేట పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు మద్యం సీసాలతో వెళుతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద దొరికిన నాలుగు సీసాలు కర్ణాటక ప్రీమియం మద్యం అని గుర్తించారు. సదరు వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు గోవర్ధన్‌రెడ్డి నివాసంలో సోదాలు చేసి డిఫెన్స్ రకానికి చెందిన వివిధ రకాల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వీటిని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట రాహుల్ గాంధీ ధర్నా



**అక్షరటుడే, న్యూ ఢిల్లీ:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్‌లోని ఒక పోలీస్ స్టేషన్‌లోకి పెల్లెట్ గన్ బాధితుడైన ఒక వ్యక్తితో కలిసి ధర్నా చేశారు. జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనల సమయంలో పెల్లెట్ల దెబ్బకు గురయ్యాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న సాహిల్ లోచాబ్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి పోలీసులు నిరాకరించారు. దీంతో రాహుల్ గాంధీ బాధితులతో కలిసి పోలీస్ స్టేషన్ బయట ధర్నాకు దిగారు. వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



## కారు డిక్కీలో మహిళ మృతదేహం


**అక్షరటుడే, వరంగల్ :** కారు డిక్కీలో మహిళ మృతదేహం కలకలం రేపింది. ఈ ఘటన హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో చోటు చేసుకుంది. బస్టాండ్ సమీపంలోని పార్క్ వద్ద రెండు రోజులుగా కారు పార్క్ చేసింది. ఆ కారులో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి కారులో పరిశీలించగా.. డిక్కీలో కుళ్లిన స్థితిలో మృతదేహం కనిపించింది. కారు నంబర్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలిని గోదావరిఖనికి చెందిన మానసగా గుర్తించారు. ఆమె స్నేహితుడు వినోద్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

## కుతుబ్ షాహీ సమాధుల వద్ద సొరంగం గుర్తింపు

**అక్షరటుడే, హైదరాబాద్ :** గోల్కొండలోని '18 సీడీ' వద్ద ఉన్న 400 ఏళ్ల నాటి కుతుబ్ షాహీ సమాధులు, ఆటస్థలం ప్రాంతంలో సొరంగం బయట పడింది. అక్కడ అక్రమంగా తవ్వకాలు జరిపినట్లు సమాచారం. ఈ క్రమంలో సొరంగాన్ని గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయాన్ని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు త్వరలో అక్కడ పరిశీలించనున్నారు.



## సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు బ్రేక్



**అక్షరటుడే, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలో పర్యటించాల్సి ఉండగా, కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంలో భాగంగా ఆయన అమెరికాకు వెళ్లాల్సి ఉంది. అయితే ఈ పరిణామంతో ఆయన తన లండన్ పర్యటనను ముగించుకుని, బోస్టన్‌కు వెళ్లాల్సిన ప్రణాళికను రద్దు చేసుకుని ఆగస్టు 23న నేరుగా హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. ముఖ్యమంత్రి యూకే, యూఎస్ పర్యటనల కోసం రాష్ట్ర ప్రభుత్వం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను సంప్రదించగా.. వారు కేవలం యూకే పర్యటనకు మాత్రమే ఆమోదం తెలిపారు. అధికారిక ప్రతినిధి బృందం ఇప్పటికే యూకే చేరుకున్న తర్వాత అమెరికా పర్యటన నిలిచిపోయినట్లు సమాచారం అందింది. "రాజకీయ కోణం" కారణంగానే ఈ అనుమతిని నిరాకరించినట్లు విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది.

## ఘోర విమాన ప్రమాదం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలోని పశ్చిమ అలస్కాలో ఒక మారుమూల ప్రాంతంలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. ఎనిమిది మంది ప్రయాణికులతో వెళ్తున్న చార్టర్డ్ విమానం రాడార్ కేంద్రం సమీపంలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ఉన్న ప్రయాణికులు, సిబ్బంది అందరూ ప్రాణాలు కోల్పోయారు. జాతీయ రవాణా భద్రతా మండలి బోర్డు ఛైర్మన్ క్లింట్ జాన్సన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ విమానంలో ఇద్దరు పైలట్లు, ఆరుగురు ప్రయాణికులు ఉన్నారు.

